# జీవితం వడ్డించిన విస్తరి కాదు

కె. మధుసూదన్




మనిషి జీవిత మెప్పుడు వడ్డించిన విస్తరి కాదు. తిని ఆరగించడానికి. ఈ సూక్తి రాజుకైనా! పేదకైనా! ఎంతటి వానికైనా వర్తిస్తుంది. ఇది నగ్నసత్యం. ఈ సత్యాన్ని ఎవరు కాదనరు. ఆ మాటే నా స్నేహితుడు సుబ్బారావుతో అంటే వాడు దీన్ని తేలిగ్గా కొట్టిపారేస్తుంటాడు. వాడు భూమిపైకి వచ్చేటప్పుడు బంగారు చెంచాను నోట్లో పెట్టుకొని వచ్చినట్లుగా ప్రవర్తిస్తుంటాడు. కారణం వాడు లక్షాధికారి కావడమే! లక్షలకు అధిపతి కావడమే! అవే వాణ్ని అలా పలకించింది. అవే వాణ్ని అలా ఆడించింది.

ఆ తర్వాత వాని జీవితం ఎలా మలుపులు తిరిగిందీ? చెపుతా వినండి.

వాడు నేను ఒకే కాలేజిలో చదివాం. కాలేజి చదువు పూర్తి అయ్యేవరకు కాలేజిలో దర్జాగా వెలిగాడు. తన దర్జా తనాన్ని ప్రదర్శించాడు. అసలు కష్టం ఎలా ఉంటుందో? దాని స్వరూపమేమిటో ఇంతవరకు వాడికి తెలియదు. కారణం అలాంటి పరిస్థితులు అటువంటి అవగాహనలు వాని కను చూపుల్లో లేకపోవడమే! అవి వాని దరికి రాకపోవడమే! అందుకే వానికి కష్టాలు - కన్నీళ్ల బాధలు, ఇవి బాధలంటే ఏమిటో తెలియదు. వాని తండ్రి అలా పెంచాడు మరి.

కాలగమనంలో ఇరువై ఐదు వసంతాలు గడిచిపోయాయి. ఇరువై ఆరువ వసంతంలో వసంతతో అతని వివాహం వైభవంగా జరిగింది.

సుబ్బారావు మామగారు ఆస్థి విషయంలో అయితేనేం! అంతస్తు విషయంలో అయితేనేం! వీరికంటే పై మెట్టులోనే ఉన్నారు. సుబ్బారావు భార్య వసంత ప్రతి విషయంలో అతనికంటే రెండాకులు ఎక్కువగానే చదివింది.

టూత్ పేస్ట్ మొదలుకొని సమస్తం సేవకులు చేయవలసిందే! సేవకులు అన్ని సేవలు అందించవలసిందే! ఏ చిన్న విషయమైనా సరే ఆమె ముందు చేతులు కట్టుకొని నిలబడవలసిందే. ఆమె ఇంట్లో ఆడింది ఆట పాడింది పాట. ఆమె అడుగు జాడల్లో అందరూ నడవవలసిందే!

పుట్టింట్లో అలాగే జరిగింది. మెట్టింట్లో కూడా అలాగే జరిపించుకుంటోంది. లక్ష్మీ పుత్రిక కాబట్టి అలా జరగడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

సుబ్బారావు వసంతల జీవితాలు దివ్యంగా కొనసాగుతున్నాయి. వారిద్దరు నిరంతరం స్వర్గ సుఖాలు అనుభవిస్తున్నారు. స్వర్గాన్ని భూలో కానికి తెచ్చి ఆ సుఖం ఇక్కడ అనుభవిస్తున్నారా అనిపిస్తోంది. ఇటు సుబ్బారావు తండ్రి. అటు వసంత తండ్రి కొత్త కొత్త వ్యాపారాలు మొదలు పెట్టి తమ బ్యాంక్ బ్యాలన్స్ మరింతగా పెంచుకుంటున్నారు.

పెరుగుట విరుగుట కొరకే అన్నట్లుగా ఇటు సుబ్బారావు తండ్రి వ్యాపారం. అటు మామగారి వ్యాపారం కని వినీ ఎరగని రీతిలో నష్టం వచ్చి వాళ్లను నిలవనీడ లేకుండా చేశాయి.

వాళ్ల వ్యాపారాలు వాళ్లను నిలువునా ముంచి వేసాయి.

ఇప్పుడు సుబ్బారావు వసంతలు మామూలు దంపతులు సమాజం దృష్టిలో. అతి సామాన్యులు నిరుపేదల కుటుంబాల్లో వాళ్లదో కుటుంబం. ఉన్న ఇల్లు అప్పులు వాళ్లు జప్తు చేయడంతో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇరుకు - ఇరుకు గదుల్లో అనేక ఇబ్బందులకు గురౌతూ జీవిస్తున్నారు. తిండికి బట్టకు కరువు ఏర్పడడంతో ఉదరపోషణ కొరకు డిగ్రీ చేత పట్టుకొని ఉద్యోగ అన్వేషణల్లో పడ్డాడు సుబ్బారావు.

నిరంతరం ఉద్యోగం కొరకు ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అలా తిరగ్గా - తిరగ్గా ఒక ప్రవేట్ కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది.

ఇప్పుడు తెలిసింది సుబ్బారావుకు. ప్రపంచంలో కష్టాలు - సుఖాలు దుఃఖాలు కన్నీళ్లు ఉంటాయని. అవి ఎంతటి వానికైనా తప్పవని మనిషి అన్నవానికి ఇది తప్పనిసరని. వీటిని ఎప్పుడో ఒకప్పుడు అనుభవించవలసిందేనని! మనిషి జీవితం ఎప్పుడు వడ్డించిన విస్తరి కాదని. పుడుతూనే ఎవరూ బంగారు చెంచా చేతితో పట్టుకొని పుట్ట లేదని. ❄